క్లుప్తంగా

సత్వరమే సమస్యల పరిష్కారానికి చర్యలు



తెర్లాం: ఎం.ఆర్.అగ్రహారంలో తహసీల్దారు హేమంత్‌కుమార్‌కు భూ సమస్యలు తెలియజేస్తున్న రైతులు

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రామ గ్రామాన నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు వినతులు వెల్లువెత్తుతున్నాయి. భూ సరిహద్దు, విస్తీర్ణం, మ్యుటేషన్ సమస్యలు సహా రైతుల మధ్య నెలకొన్న భూ తగాదాలు, వివిధ ధ్రువపత్రాలకు సంబంధించి ప్రజల నుంచి అధికారులు గురువారం వినతిపత్రాలు స్వీకరించారు. 40 రోజుల్లోగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, అప్పటికీ పరిష్కారం కాకపోతే మరోసారి జరిగే సదస్సుల్లో తమ దృష్టికి తీసుకువస్తే సత్వరమే చర్యలు చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు.

–బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్

విద్యుత్ చార్జీలు పెంచొద్దు



విద్యుత్ చార్జీలు పెంచొద్దని విజ్ఞప్తి చేస్తూ ఉత్తరాంధ్ర సాధన సమితి కన్వీనర్ వేమిరెడ్డి లక్ష్మునాయుడు కొంతమందితో కలిసి బొబ్బిలి పట్టణ మెయిన్‌రోడ్డులో గురువారం ప్లకార్డులు ప్రదర్శించారు. ఎన్నికల హామీలు అమలు చేయకుండా ఓ వైపు నిత్యావసర సరుకుల ధరలు, మరోవైపు విద్యుత్ చార్జీలు పెంచడం దుర్మార్గమన్నారు. గెలవడం కోసం హామీలు ఇచ్చి, గెలిచిన తర్వాత హామీలు అమలు మరిస్తే ఎలా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా నిత్యావసర సరుకుల ధరలు తగ్గించి, విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయం వెనక్కి తీసుకోవాలని కోరారు.

–బొబ్బిలి

ఇలా తరలిస్తే ప్రమాదం కాదా?



సంతకవిటి, రేగిడి, వంగర మండలాల నుంచి రాజాం పట్టణం మీదుగా ఇతర ప్రాంతాలకు ట్రాక్టర్లలో తరలిస్తున్న ఇసుకతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాక్టరులోని ఇసుక ఎగరకుండా టార్పాలిన్ కప్పకపోవడంతో వెనక వచ్చే వాహనదారుల కళ్లల్లోకి ఇసుక వచ్చి పడుతోంది. ఒక్కసారిగా మూయాల్సి వస్తున్న కళ్ల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

–రాజాం

ప్రభుత్వ కళాశాలలు ఏర్పాటు చేయాలి



బొబ్బిలిలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డి.రాము డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ 32వ జిల్లా మహాసభలకు సంబంధించి, రూపొందించిన వాల్‌పోస్టర్లను బొబ్బిలి పట్టణంలోని ట్రిపుల్ ఎస్ డిగ్రీ కళాశాలలో గురువారం ఆవిష్కరించారు. విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎస్ఎఫ్ఐ అలుపెరగని పోరాటం చేస్తోందని, మున్ముందు కూడా ఉద్యమాలు కొనసాగుతాయన్నారు.

–బొబ్బిలి

గ్రామాలను అభివృద్ధి పథంలో నడపాలి

తెర్లాం/బొబ్బిలి రూరల్/బాడంగి: మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీల్లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనపై నిర్వహించనున్న శిక్షణా తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులంతా.. గ్రామాలను అభివృద్ధి పథంలో నడపాలని, అన్నిరంగాల్లోనూ గ్రామాలు అభివృద్ధి చెందేలా పనిచేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ!



బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ పేరిట ఎన్నికలప్పుడు చంద్రబాబు ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలు అమలు చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎలాగైనా గెలవాలన్న ఆశతో కూటమి నేతలు అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చి మరీ ప్రజలను ఊదరగొట్టారు. ఆశించిన ప్రజలు సైతం ఓట్లేశారు. వారు అనుకున్నట్లే అధికారంలోకి వచ్చారు.. కానీ హామీల అమలు మాత్రం మరిచారు. ఇప్పటివరకు ఏ ఒక్క హామీ పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. నమ్మిన వారిని మోసం చేయడంలో చంద్రబాబు తర్వాతే ఎవరైనా అని.. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ అని జనం దుమ్మెత్తిపోస్తున్నారు.

–బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్

- అటకెక్కిన ఎన్నికల హామీలు
- కానరాని సూపర్ సిక్స్ పథకాలు
- గాలికొదిలేసిన నియోజకవర్గ అభివృద్ధి చర్యలు
- అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా అమలు శూన్యం
- ప్రజలను మోసగించడంలో చంద్రబాబు తనదైన మార్క్
- మండిపడుతున్న నిరుద్యోగులు, మహిళలు, విద్యార్థులు



డబుల్ రోడ్డుగా చేస్తానన్న రాజాం–సంతకవిటి రోడ్డు



నిలిచిన సంతకవిటి మండలంలోని బలసలరేవు వంతెన పనులు

ఏప్రిల్ 15న ఎన్నికల ప్రచారానికి రాజాం వచ్చినప్పుడు చంద్రబాబు, కూటమి అభ్యర్థిగా బరిలో ఉన్న కోండ్రు మురళీమోహన్‌లు నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలు..

- రాజాం ప్రధాన రోడ్డు విస్తరణను మూడు నెలల్లో పూర్తి చేస్తాం
- రాజాంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా రింగురోడ్డు నిర్మిస్తాం.
- రాజాం పట్టణంలో భూగర్భ మురుగునీటి వ్యవస్థ(అండర్ డ్రైనేజి)ను ఏర్పాటు చేస్తాం.
- నియోజకవర్గంలో అంతర్గత రోడ్ల అభివృద్ధి చేస్తాం.
- అన్ని మండలాలకు డబుల్ రోడ్లు వేస్తాం.
- మూతపడిన పరిశ్రమలు తెరిపిస్తాం
- టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందిస్తాం
- నిరుపేదలందరికీ రెండు సెంట్ల స్థలం కేటాయించి, ఇళ్లు నిర్మించి ఇస్తాం
- వాల్తేరు వంతెన పూర్తి చేస్తాం

నరకయాతన పడుతున్నాం..



రాజాం–పాలకొండ ప్రధాన రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయలేదు. అధికారంలోకి రాగానే రోడ్డు నిర్మిస్తామని చంద్రబాబు చెప్పారు. కనీసం గోతులైనా పూడ్చడం లేదు. గతంలో గోతులైనా పూడ్చేవారు. ప్రస్తుతం అధ్వానంగా ఉన్న ఈ రోడ్డులో ప్రయాణం చేయాలంటే నరకయాతన పడుతున్నాం.

–కామోదుల శ్రీరంగంనాయుడు, పొగిరి, రాజాం మండలం

వంతెన పనులు ముందుకు సాగలేదు..



గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వాల్తేరు వద్ద నాగావళి నదిపై వంతెన నిర్మాణానికి రూ.37 కోట్లు మంజూరు చేసి, పనులు కూడా ప్రారంభించింది. వంతెన పిల్లర్ల నిర్మాణం కూడా చకచకా జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వంతెన మిగతా నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. ఇచ్చిన హామీ మేరకు వంతెన నిర్మించాలి.–గురుగుబెల్లి స్వామినాయుడు, వాల్తేరు, సంతకవిటి మండలం

అన్నీ ఉత్తుత్తి హామీలే..



అధికార దాహం తీర్చుకునేందుకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ ఉత్తుత్తివే.. ఎన్నికలప్పుడు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఎలాగో అమలు చేయరు.. కనీసం నియోజకవర్గాలకు ప్రాంతాల వారీగా ఇచ్చిన హామీలైనా అమలు చేయాలి కదా.. వాటిని కూడా చంద్రబాబు సర్కారు పట్టించుకోవడం లేదు. ప్రతిపక్ష పార్టీ నాయకులపై కక్ష సాధింపు చర్యలు తప్ప ప్రజలకు చేసిన మేలు ఏమీ లేదు. –డాక్టర్ తలే రాజేష్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాం

బొబ్బిలి నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలు..



బొబ్బిలి: గొల్లాది వద్ద వంతెన నిర్మిస్తామన్న ప్రదేశం ఇదే..

బొబ్బిలి: పై చిత్రంలో కనిపిస్తోన్న రోడ్డు.. ఇదేదో మారుమూల గిరిజన గ్రామానికి వెళ్లే రోడ్డు అనుకుంటే పొరపాటే.. రెవెన్యూ డివిజన్ అయిన బొబ్బిలిలోని పూల్‌భాగ్, మహారాణిపేట ప్రాంతాలకు 200 మీటర్ల దూరంలోని బైపాస్ రోడ్డు ఇది. రోడ్డంతా గుంతలమయమై, ఎత్తుపల్లాలతో అస్తవ్యస్తంగా ఉంది. ఇదే రోడ్డును బాగు చేయాలని అప్పట్లో ప్రస్తుత ఎమ్మెల్యే బేబినాయన పాదయాత్ర కూడా చేశారు. తాను గెలిస్తే రోడ్డు బాగుచేస్తానని స్థానికులకు హామీ ఇచ్చారు. అయితే ఇప్పుడు ఆయనే ఎమ్మెల్యేగా ఉన్నా రోడ్డును పట్టించుకోవడం లేదు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా రోడ్డు బాగు చేయరా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



ఎమ్మెల్యే బేబీ నాయన దత్తత తీసుకుని, అభివృద్ధి చేస్తానన్న రామభద్రపురంలోని కొండకెంగువ గ్రామం ఇది..

- బొబ్బిలికి ప్రభుత్వ కళాశాలలు తెప్పిస్తాం
- బొబ్బిలి ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి దాడితల్లి ఆలయం వరకు పాడైన రోడ్డును బాగు చేస్తాం
- బొబ్బిలిలోని గ్రోత్ సెంటర్‌లో మూతపడిన పరిశ్రమలు తెరిపించి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం
- బొబ్బిలి నుంచి అలజంగి మీదుగా తెర్లాం..కు రహదారి నిర్మిస్తాం
- బొబ్బిలి మండలంలోని రాముడువలసలో ఎత్తిపోతల పథకం నిర్మిస్తాం
- ప్రతీ మండలంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తాం
- బాడంగి మండలంలోని గొల్లాది నుంచి బొబ్బిలి వైపు వెళ్లేందుకు వీలుగా వేగావతి నదిపై వంతెన నిర్మిస్తాం
- రామభద్రపురం–రాజాం రోడ్డు నిర్మిస్తాం
- బాడంగికి జూనియర్ కళాశాల తీసుకువస్తాం
- బాడంగి మండలంలోని డొంకినవలస, వీరసాగరం తదితర ప్రాంతాలకు సాగునీరు అందేలా పార్వతీపురం మన్యం జిల్లాలోని పాచిపెంట పెద్దగెడ్డ ప్రాజెక్టు నుంచి సాగునీరు తెస్తాం
- తెర్లాం మండలంలోని లోచర్ల తదితర గ్రామాలకు 1750 ఎకరాలకు సాగునీరు అందేలా లోచర్ల ఎత్తిపోతల పథకం నిర్మిస్తాం
- రామభద్రపురం మండలంలోని కొండకెంగువ గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తాం
- రామభద్రపురంలోని అంతర్‌రాష్ట్ర కూరగాయల మార్కెట్‌ను ఆధునీకరిస్తాం
- ఏడొంపుల గెడ్డ మరమ్మతులు చేపడతాం.

అభివృద్ధి, సంక్షేమం.. రెండూ లేవు..



అధికారంలోకి వచ్చిన వెంటనే బొబ్బిలి నియోజకవర్గాన్ని, ముఖ్యంగా బొబ్బిలి పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ఎన్నికల సమయంలో కూటమి నేతలు హామీ ఇచ్చారు. అధికారం చేపట్టి, ఆరు నెలలైనా ఇప్పటివరకు వారు చేసిన అభివృద్ధి, సంక్షేమం రెండూ లేవు. ఎన్నికలప్పుడు సూపర్ సిక్స్ హామీలతో పాటు ప్రతీ నియోజకవర్గానికి అది చేస్తాం.. ఇది చేస్తాం అని జనాన్ని ఊదరగొట్టారు. ఇప్పుడేమీ చేయడం లేదు.

–రియాజ్‌ఖాన్, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు, బొబ్బిలి

పెట్టుబడి సాయం ఏది 'బాబు'?

రామభద్రపురం: గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏటా క్రమం తప్పకుండా వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయం అందజేశారు. అర్హులైన ప్రతీ రైతుకు సాయం అందిస్తూ సాగును పండగలా మార్చారు. అయితే ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు మాత్రం అన్నదాత సుఖీభవ పథకం పేరిట ఏటా ప్రతీ రైతుకు రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి రాగానే హామీలు అమలు చేయడం మరిచారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ పంటల సాగు ముగిసి, రబీ సీజన్ పంటల సాగుకు రైతన్నలు సిద్ధమైనా ఇప్పటికీ పెట్టుబడి సాయం అందని పరిస్థితి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు.

గతంలో సాయం ఇలా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి బొబ్బిలి నియోజకవర్గంలోని రామభద్రపురం, బొబ్బిలి, బాడంగి, తెర్లాం మండలాల్లో 2019–20లో 37,217 మంది రైతులకు రూ.50.24 కోట్లు, 2020–21లో 39,732 మంది రైతులకు రూ.53.64 కోట్లు, 2021–22లో 39,768 మందికి రూ.53.69 కోట్లు, 2022–23లో 39,601 మందికి రూ.53.82 కోట్లు, 2023–24లో 41,223 మందికి రూ.55.89 కోట్లు అందజేశాయి. ఏడాదికి ఒక్కొక్క రైతుకు రూ.13,500 చొప్పున మొత్తం రూ.267.28 కోట్లు అందజేయడం జరిగింది.



రామభద్రపురం: రబీ సాగుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి..



కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. ఇస్తానన్న రూ.20 వేల పెట్టుబడి త్వరగా ఇవ్వాలి. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాదిరిగానే అన్నదాతలను ఆదుకోవాలి. –సత్యం, రైతు, ఎస్.చింతలవలస గ్రామం, రామభద్రపురం మండలం

సంక్షిప్తంగా...

రూ.40 లక్షలతో బైపాస్ రోడ్డు మరమ్మతులు

బొబ్బిలి: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి దాడితల్లి ఆలయం వరకు ఉన్న బైపాస్ రోడ్డు మరమ్మతుల కోసం రూ.40 లక్షలు మంజూరు చేస్తున్నట్లు బుడా(బొబ్బిలి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు తెలిపారు. ఇదే విషయమై ఆయన స్థానిక బుడా కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. త్వరితగతిన రోడ్డు మరమ్మతులు పూర్తయ్యేలా చూస్తామన్నారు.

చదువుతో పాటు ఆరోగ్యంపై దృష్టిసారించాలి

రేగిడి: విద్యార్థుల చదువుతో పాటు వారి ఆరోగ్యంపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈవో ఎంవీ ప్రసాదరావు సూచించారు. మండలంలోని దేవుదళ కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం)ని గురువారం సందర్శించిన ఆయన.. అక్కడి విద్యార్థుల చదువు, వారి ఆరోగ్యం పట్ల తీసుకుంటున్న జాగ్రత్త చర్యలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సిబ్బందిని కోరారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

రేగిడి: రైతుల నుంచి నేరుగా ధాన్యం కొనుగోలు చేయాలని వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావులు అధికారులకు సూచించారు. ఇదే విషయమై మండలంలోని చిన్నశిర్లాంలో విలేకరులతో గురువారం మాట్లాడిన వారు.. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. .

ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించాలి

రేగిడి: ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించాలని ఏవో జి.మురళీకృష్ణ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని అంబకండి గ్రామంలో రబీ సాగు–తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం అవగాహన కల్పించారు. రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి, సేంద్రియ ఎరువులు వినియోగించాలన్నారు.

'పోరుబాట'ను విజయవంతం చేయండి

- వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

రాజాం: అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ పేరిట అన్ని జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్ వద్ద శుక్రవారం చేపట్టే పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ కోరారు. ఇదే విషయమై స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడిన ఆయన.. సూపర్ సిక్స్ హామీలు ఇస్తామని చెప్పి, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం వాటిని అమలు చేయడం మరిచిందని విమర్శించారు. ముఖ్యంగా అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుకు ఏటా రూ.20 వేల సాయం ఇస్తామన్న చంద్రబాబు.. ఖరీఫ్ సీజన్ పంటల సాగు ముగిసి, రబీ సీజన్ పంటల సాగు మొదలెడుతున్నా అన్నదాతకు అందిస్తామన్న పెట్టుబడి సాయం అందివ్వలేదని మండిపడ్డారు. రైతులకు ప్రభుత్వం చేస్తున్న అన్యాయంపై అందరం గళం ఎత్తాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమానికి వచ్చే వారంతా ఉదయం 8 గంటలకు రాజాంలోని పార్టీ కార్యాలయానికి చేరుకోవాలని, ఇక్కడి నుంచి అందరం జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి ఉంటుందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు సారథ్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించనున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, జెడ్పీటీసీ బి.నర్సింహులు, కన్వీనర్ కె.శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు టి.అచ్చెన్నాయుడు, వి.జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్

'అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ'..

రామభద్రపురం: రైతుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయంపై అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ పేరుతో పార్టీ చేస్తున్న పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు కోరారు. ఇదే విషయమై ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. రైతు సమస్యలపై రైతులందరితో కలిసి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద శుక్రవారం నిరసన చేపట్టనున్నామని, పార్టీ శ్రేణులంతా హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎ.లక్ష్మునాయుడు, పాలసొసైటీ అధ్యక్షుడు సీహెచ్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

100 మద్యంసీసాల స్వాధీనం

రాజాం సిటీ: అక్రమంగా మద్యంసీసాలు తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి నుంచి 100 మద్యంసీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వై.రవికిరణ్ గురువారం తెలిపారు. స్థానిక పట్టణ పరిధిలోని చాకలివీధికి చెందిన ఓ వ్యక్తితో పాటు తెర్లాం మండలంలోని పెరుమాలి గ్రామానికి చెందిన మరో వ్యక్తి పొగిరి వైపుగా మద్యం తరలిస్తుండగా మొగిలివలస జంక్షన్ వద్ద వారిద్దరినీ పట్టుకున్నామన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రామమందిరం నిర్మాణానికి భూమిపూజ

తెర్లాం: మండలంలోని డి.గదబవలస గ్రామంలో కొత్తగా రామమందిరం నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. ఎన్నో ఏళ్ల క్రితం ఇక్కడున్న రామాలయాన్ని పూర్తిగా తొలగించి, ఆ స్థానంలో ఆలయ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు. వీలైనంత త్వరగా నిర్మాణం పూర్తి చేస్తామన్నారు.

సక్రమంగా ఎన్నికలు నిర్వహించాలి

రాజాం సిటీ: సాగునీటి సంఘాల ఎన్నికలను సక్రమంగా నిర్వహించాలని ఇరిగేషన్ ఏఈ రాజేష్ సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో పీవోలకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమానికి గురువారం హాజరైన ఆయన.. ఈ నెల 14వ తేదీన జరిగే ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని తెలిపారు. ఓటర్ల వివరాలు క్షుణ్ణంగా పరిశీలించి, ఎటువంటి అభ్యంతరాలు లేకుండా చూడాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సంతకవిటి: మండలంలోని హొంజరాం ఫీడర్ పరిధిలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఈఈ జి.సురేష్‌బాబు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. విద్యుత్ మరమ్మతుల కారణంగా మందరాడ, అక్కరాపల్లి, ముకుందపురం, గోవిందపురం, అప్పలాగ్రహారం, చిత్తారపురం, హొంజరాం, గారన్నాయుడుపేట, చింతలపేట గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించి, సహకరించాలని కోరారు.